MILLET NETWORK OF INDIA

# MILLET NETWORK OF INDIA

*# 101, Kishan Residency, Street No 5, Hyderabad, Telangana – 500 016,*
*Ph: 040 27764577 / 27764722 / www.ddsindia.com, www.millietindia.org*

**మార్చి 9, 2018**

## పత్రికా ప్రకటన

## చిరుధాన్యాల చెల్లెండ్లు.........నారీ శక్తికి ప్రతీక !

***మహిళల సాధికారత సాధించడంలో*** చిరుధాన్యాల సేద్యంలో రైతు చెల్లెండ్లకు భాగస్వామ్యం కల్పించడంలో చేసిన విస్తృతమైన కృషికి గుర్తింపుగా ప్రతిష్ఠాత్మకమైన ***నారీ శక్తి పురస్కారం, 2017 ను కేంద్ర ప్రభుత్వం అఖిల భారత మిల్లెట్ సిస్టర్స్ నెట్ వర్క్*** **(AIMS)** ప్రకటించిందని సగర్వంగా తెలియజేస్తున్నాం. న్యూఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో మార్చి 8, 2018న అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

చిరుధాన్యాలను పంటలు సాగు చేయడంలో మహిళా రైతులను భాగస్వాములను చేసేందుకు భారతదేశ చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం నిరంతరం కృషి చేస్తోంది. చిరుధాన్యాల సాగులోను, వినియోగంలోనూ, సంరక్షణలోనూ ఈ మహిళల కృషి చాలా గొప్పగా నాగరిక ప్రపంచానికి ఒక అద్భుత వరంగా చెప్పాలి. భారతదేశ చిరుధాన్యాల చెల్లెండ్ల సమాఖ్య 2016 నవంబర్‌లో ఏర్పడింది. ఇందులో దేశవ్యాప్తంగా 5000 మంది మహిళా రైతులు సభ్యులుగా ఉన్నారు.

మన దేశంలో ఏర్పాటైన అత్యంత పురాతన స్వచ్ఛంద సంస్థల్లో డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ (డిడిఎస్) ఒకటి. వ్యవసాయం వృత్తిగా చేపట్టిన మహిళలను చిరుధాన్యాల పంటల సాగులో కీలక భాగస్వాములనుగా చేయాలనే ఆలోచనతో అడుగులు వేసింది. దేశంలో వ్యవసాయ రంగంలో మహిళల స్థానం గురించి స్పష్టమైన ఆలోచన కూడా రాని సమయంలో డిడిఎస్ అందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఫలితంగా మహిళలు అంటేనే వ్యవసాయం అనే స్థాయికి పరిస్థితిలో మార్పు వచ్చేటట్టుగా ప్రయత్నం చేస్తుంది. 80, 90 దశకాలలో మహిళలకు స్ఫూర్తినిచ్చేందుకు కృషి ప్రారంభించింది. అందుకోసం మహిళా రైతులతో రోజువారీ సమావేశాలు, సంప్రదింపులతో చిరుధాన్యాల సాగులో మన రైతు చెల్లెండ్లకు ప్రధాన పాత్ర కల్పించేందుకు డిడిఎస్ నడుంకట్టింది.

సాధారణంగా చిరుధాన్యాలు అనగానే అద్భుత ఫలితాలను ఇచ్చే ఆహార ధాన్యాలుగా (మిరకిల్ గ్రెయిన్స్), సేద్య రంగంలో ఒక వినూత్న ప్రతిపాదనగా అందరికీ తెలుసు. ముఖ్యంగా భూగోళానికి దక్షిణంగా ఉన్న మూడు ఖండాలు – అమెరికా, ఆఫ్రికా, ఆసియా – ప్రాంతాలలో వ్యవసాయ రంగంలో మరింత ప్రాధాన్యతను, ప్రాముఖ్యాన్ని సంపాదించుకుంది.

**Cont.....2**

దాదాపు 50 దేశాలలో చిరుధాన్యాల పంటల సాగు విస్తృతంగా సాగుతోంది. విశ్వవ్యాప్తంగా వాటి వినియోగం కూడా విపరీతంగా పెరుగుతోంది. అయినా మన దేశంలో రాజకీయంగా వీటికి ఉన్న ప్రాముఖ్యానికి ఇంకా సరైన గుర్తింపు రాలేదు. పైగా నిర్లక్ష్యానికి గురవుతోంది. సాంకేతికంగా ఇతర దేశాల నుంచి – అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ విత్తనాలు కానీ, రసాయనిక ఎరువులు కానీ, సాగు నీటి వసతులు కానీ చిరుధాన్యాల పంట సాగులో అవసరం ఉండదు. ఇలా బయటి నుంచి భారీ వ్యయంతో, పెద్ద ఎత్తున ముడి సరుకులు తెప్పించుకుని, అధిక దిగుబడి ప్రయోజనాలు చిరుధాన్యాల పంట సాగులో ఉండవు. ఈ కారణం చేతనే చిరుధాన్యాల విషయంలో మార్కెట్ అనుకూల పరిస్థితులు అంతగా అందుబాటులో లేవు. అంటే కార్పొరేట్ ప్రభావంతో కూడిన ఆర్థిక ప్రయోజనాలు ప్రధానంగా భావించే మార్కెట్ మద్దతు లేకపోవడం చిరుధాన్యాలకు ఎదురవుతున్న మరో పెద్ద సమస్య. ప్రభుత్వాలు కూడా ఈ కారణం వల్లనే చిరుధాన్యాల సాగుకు సహాయపడటంలేదు.

*భారతదేశ చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం పేరుతో చేపట్టిన ఈ పెద్ద కార్యక్రమంలో దిగువ తెలిపిన కారణాల ప్రాధాన్యత చాలా ఉంది.*

– చిరుధాన్యాలు సుస్థిరమైన ప్రయోజనాలు అందిస్తుంది.
– చిరుధాన్యాలు జీవితాన్ని చైతన్యవంతం చేస్తాయి.
– చిరుధాన్యాలు జీవితాన్ని కాపాడతాయి.
– చిరుధాన్యాలు నూతన సృష్టికి తోడ్పడతాయి.

చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం, డిడియస్ సహకారంతో భారతదేశ చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘంగా రూపుదిద్దుకుంది. సంప్రదాయకంగా తరతరాలుగా పర్యావరణ పరిరక్షణకు మేలు చేసే వ్యవసాయ విధానాలను సురక్షితంగా కాపాడుతున్న రైతు చెల్లెండ్ల సేద్య నైపుణ్యాన్ని ప్రోత్సహించేందుకు ఒక వేదికగా చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం ఏర్పడింది.

కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నారీ పురస్కారంతో చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం సంతృప్తి పడటంలేదు. చిరుధాన్యాల సంవత్సరంగా ఈ ఏడాది కాలాన్ని ఐక్యరాజ్య సమితి ప్రకటించాలన్న లక్ష్యం కోసం ఏడాది క్రితం భారత ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానం ఫలించినప్పుడే చిరుధాన్యాల పంటల సాగులో నిరంతరం శ్రమిస్తున్న రైతు చెల్లెండ్లు విశ్రమించగలరు. ఏదో మొక్కుబడి ప్రయత్నాలు కాదు. స్పష్టమైన, నిర్దుష్టమైన కార్యాచరణ మాత్రమే కావాలని వారు ఏకగ్రీవంగా నిర్ణయించుకున్నారు. వారు ముక్తకంఠంతో తెలియజేస్తున్న విషయాలు ఇలా ఉన్నాయి.

చిరుధాన్యాలు మాకు వారసత్వంగా సంక్రమించిన సుసంపన్నమైన పంట. తరతరాలుగా మా కుటుంబాలకు ఆహారం అందిస్తున్నాయి. మా పశువులకు మేతగా ఉపయోగపడుతున్నాయి. మా పంట చేలను భూసారంతో సంరక్షిస్తున్నాయి. మా ఆరోగ్యానికి పూర్తి రక్షణ కల్పిస్తున్నాయి.

Cont.....3

చిరుధాన్యాల ఆధారంగా మేము సాగించే వ్యవసాయంలో పెద్ద మొత్తంలో సాగు నీరు కానీ, విద్యుత్ కానీ అవసరం ఉండదు.

చిరుధాన్యాలను సాగుచేసేందుకు రసాయనిక ఎరువులు ఏ మాత్రం అవసరం లేదు. క్రిమిసంహారకాలను ఒక్క బొట్టు కూడా మేం ఉపయోగించం.

చిరుధాన్యాల సాగుకు అవసరమైన పూర్తి పరిజ్ఞానం మాకు అందుబాటులోనే ఉంది. అందువల్లనే మేము ఎన్నో తరాలుగా స్థిరంగా చిరుధాన్యాలను సాగు చేయగలుగుతున్నాం. ఇది మాకు వారసత్వంగా లభించిన సంపద. ఇప్పుడు చిరుధాన్యాల సాగు ప్రాధాన్యతను విశ్వవ్యాపితం చేసేందుకు భారత ప్రభుత్వం కూడా సంసిద్ధంగా ఉండడం మాకు చాలా సంతోషం కలిగిస్తోంది.

అయినప్పటికీ, చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించేందుకు చేస్తున్న కృషి కారణంగా ఇంతవరకు రైతు చెల్లెండ్లకు జీవనాధారంగా నిలుస్తున్న చిరుధాన్యాల సాగులో చిన్న కారు రైతులకు, రైతు మహిళలకు ఉన్న అవకాశాలకు ఎలాంటి హాని కలగకుండా చూసుకోవాలని సవినయంగా కోరుతున్నాం.

పెద్ద వ్యాపార సంస్థలు, కార్పొరేట్ వ్యవస్థలు ఇప్పటికే సేంద్రీయ వ్యవసాయంపై తమ పట్టు బిగించాయి. నిజానికి ఎన్నో తరాలుగా ఈ వ్యవసాయ విధానమే మాకు దిక్కుగా ఉంటోంది. ఇదే విధంగా చిరుధాన్యాలను కూడా కార్పొరేట్ చేతుల్లో పెట్టినట్టయితే తరతరాలుగా అండగా నిలుస్తున్న చిరుధాన్యాల సేద్యం మాకు పూర్తిగా దూరమైపోతుంది. అలాంటి పరిస్థితిని నివారించేందుకు ఈ సంవత్సరాన్ని ***అంతర్జాతీయ చిరుధాన్యాల సంవత్సరంగా కాకుండా చిన్న సన్నకారు మహిళా రైతుల సంవత్సరంగా*** పాటించడం మంచిది. ప్రభుత్వం కూడా మాలాంటి చిన్న సన్నకారు, మహిళా రైతులకు మాత్రమే ఉపయోగపడే విధంగా చిరుధాన్యాల సేద్యాన్ని ప్రకటిస్తే చాలా మంచిది.

నారీ పురస్కారం లభించిన సందర్భంగా మేమంతా (చిరుధాన్యాల చెల్లెండ్ల సంఘం) అంటే చిరుధాన్యాల పంటల సాగులోనే జీవితాలు సాగిస్తున్న రైతు చెల్లెండ్లు, డిడిఎస్ సంయుక్తంగా దీక్ష చేపడుతున్నాము.

**ఇట్లు**



**పి.వి. సతీష్**
**డైరెక్టర్, డెక్కన్ డెవలప్‌మెంట్ సొసైటీ**
**కన్వీనర్, మిల్లెట్ నెట్‌వర్క్ ఆఫ్ ఇండియా**